క్లుప్తంగా

సిఫార్సు చేసిన ఎరువులే వాడాలి

పెదపూడి: వ్యవసాయ శాఖ అధికారులు సిఫార్సు చేసిన ఎరువులు, పురుగు మందులనే వాడితే పెట్టుబడులు తగ్గి, అధిక దిగుబడులు సాధించొచ్చని ఏఓ టీవీఆర్ మణిదీప్ రైతులకు సూచించారు. మండలంలోని దోమాడలో శనివారం ఆయన రైతులతో మాట్లాడుతూ విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడితే పొలం పాడవుతుందన్నారు. మండలంలోని పొలాల్లో జింక్ లోపాన్ని నివారించేందుకు జింక్ సల్ఫేట్ మందును వారంలో రెండు సార్లు స్ప్రే చేయాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారు

పెదపూడి: సంపరలో ప్రాచీన వేంకటేశ్వర స్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం మొదటి శనివారం ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

నిందితులను శిక్షించాలి

కంబాలచెరువు: మణిపూర్ రాష్ట్రంలో మారణహోమాన్ని ఆపాలని, మహిళలపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను కేంద్రం వెంటనే ఆపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.భాను ప్రసాద్, దినేష్, ధర్మేష్, మావో, అరుణ జ్యోతి, ప్రవల్లిక, మాధవి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

ఊక లారీలతో వాహన చోదకులకు ఇబ్బందులు


ఏడీబీ రోడ్డుపై ప్రమాదభరితంగా వెళుతున్న ఊక లారీ

రంగంపేట: ఏడీబీ రోడ్డులో నిత్యం విపరీతంగా తిరుగుతున్న ఊక లారీలు వల్ల వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊక లారీల్లో రెండు వైపులా బరకాలతో కట్టి ఊక వేయటంతో కొండల మాదిరిగా తయారై వెనుక వస్తున్న వాహనచోదకులకు రోడ్డు కనపడటం లేదంటున్నారు. దీనివల్ల ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మణిపూర్ ప్రజల కోసం శాంతి ర్యాలీ


కొండగుంటూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

రాజానగరం: అల్లరి మూకల వికృత చేష్టలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌లో తిరిగి ప్రశాంత పరిస్థితులు ఏర్పడాలని కోరుతూ కొండగుంటూరులో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కొండగుంటూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ సేవా సమితులు, కొండగుంటూరు, సంపత్‌నగరంలోని పాస్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో బొమ్మూరు వరకు ఈ ర్యాలీ జరిగింది. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, ప్రజా జీవనం సాఫీగా జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం కొండగుంటూరు గ్రామ సచివాలయానికి చేరుకుని, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

దేవస్థానాన్ని టీటీడీ దత్తత తీసుకోవాలి

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాన్ని టీటీడీ దత్తత తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నీరుకొండ వీరన్న చౌదరి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నవరం దేవస్థానం నిర్వహణలో స్వామివారి ఉత్సవాలు తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. ఈ దేవస్థానాన్ని టీటీడీ దత్తత తీసుకునేలా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి చేయాలని వారు కోరారు. ఇక్కడి రికార్డులు అన్నవరం దేవస్థానం అధికారులు తీసుకెళ్లడాన్ని తప్పుపట్టారు. రంగనాథ స్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భోజనం రుచి అదిరింది

- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ
- పెరుగుతున్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య


కొంకుదురు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పోషకాలున్న ఆహారాన్ని తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులోనూ రాణిస్తారనే ఉద్దేశంతో రోజుకో మెనూతో గోరుముద్దను అమలు చేస్తోంది. ఎప్పటికప్పుడు మెనూను మెరుగుపరుస్తూ విద్యార్థులకు రుచికరమైన ఆహారంతో పాటు రాగి జావను సైతం అందిస్తుంది. మండలంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోనూ రాగిజావను అమలు చేస్తున్నారు. అందుకే గతం కంటే ఇష్టంగా విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని అరగిస్తున్నారు.

నెలకు నాలుగుసార్లు సరఫరా

గతంలో ఏజెన్సీల నిర్వాహకులు నెలకు మూడు సార్లు కోడిగుడ్లు సరఫరా చేసేవారు. దీంతో కొన్ని చోట్ల గుడ్లు చెడిపోయేవి. ఫలితంగా విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. దాన్ని గమనించిన ప్రభుత్వం వాటికి చెక్ పెడుతూ నెలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయాలంటూ ఆదేశాలు జారీచేసింది. దీంతో పాటు ఏ వారంలో ఏ రంగు ఉన్న గుడ్డును వాడాలో కూడా గుడ్లపై స్టాంప్‌ను ముద్రించి సరఫరా చేస్తున్నారు. విద్యార్థులకు వారానికి ఐదు గుడ్లు ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వం ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న నేపథ్యంలోనే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు చెబుతున్నారు.


పందలపాక పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం

విద్యార్థులకు అందించే మెనూ వివరాలు

రోజు	మెనూ
సోమవారం	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం	పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ
బుధవారం	వెజిటబుల్ బిర్యానీ, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగి జావ
శుక్రవారం	ఆకుకూర పప్పు,ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం	ఆకు కూర, సాంబారు, తీపి పొంగలి, రాగి జావ

బిక్కవోలు మండలంలోని విద్యార్థుల వివరాలు

బిక్కవోలు మండలంలో 30 ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 4,153 మంది విద్యార్థులుండగా 3,743 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.

భోజనం రుచిగా ఉంటుంది



నేను ప్రతిరోజు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తాను. వారంలో ఐదు రోజులు కోడి గుడ్డు ఇస్తారు. రోజుకో రకం వెరైటీ భోజనం పెడుతున్నారు. భోజనం రుచిగా ఉంటుంది.

– తాడికొండ జాహ్నవి, విద్యార్థిని, కొంకుదురు ఉన్నత పాఠశాల

రోజూ పాఠశాలలోనే తింటాను



గతంలో మధ్యాహ్న భోజనం సరిగా తినే వాళ్లం కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉంటుండడంతో రోజూ పాఠశాలలోనే తింటున్నాను. ఇంట్లో భోజనంలాగే ఉంటుంది.

– మర్రా రాము, 7వ తరగతి విద్యార్థి, ఊలపల్లి ఉన్నత పాఠశాల

భోజనం చేసే విద్యార్థులు పెరిగారు



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్దగా పౌష్టికాహారం అందిస్తుంది. గతంలో కంటే పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య పెరిగింది. విద్యార్థులకు ఇష్టమైన ఆహారం జగనన్న గోరుముద్దలో పెట్టడం ఎంతో బాగుంది.

– గొలుగూరి నాగిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, పందలపాక ఉన్నత పాఠశాల

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శలు


పుణ్యక్షేత్రంలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న విజయలక్ష్మి

రాజానగరం: మండలంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శనివారం పరామర్శించారు. కొండగుంటూరుపాకలుకు చెందిన పెంటకోట మర్రిబాబు, గిరిజాల నాగేంద్రబాబు, పాత తుంగపాడుకు చెందిన ఉంగరాల భాగ్యవతి, పుణ్యక్షేత్రానికి చెందిన కొప్పల సూర్యకాంతం, పేపకాయల సత్యనారాయణ, కోటగాల దివ్య, దూల చల్లయ్య, పుల్లకుర్తి గోవిందమ్మ, జగాట ఫణి కుటుంబ సభ్యులను ఆమె కలుసుకుని, పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదానికి గురై, ఇంటి వద్దనే కోలుకుంటున్న పుణ్యక్షేత్రానికి చెందిన తాడోజి సత్తిబాబును కూడా జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. ఆమె వెంట ఆయా గ్రామాలకు చెందిన స్థానిక నాయకులు ఉన్నారు.

వచ్చే నెల 1 నుంచి గడప గడపకూ

బిక్కవోలు: ఆగస్టు 1వ తేదీ నుంచి మండలంలోని కొంకుదురు సావరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కొంకుదురు ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ శనివారం తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు తరలి రావాలని ఆయన కోరారు.

గోదావరి వరద ఉధృతం

- నీట మునిగిన లంకలు, పంటలు
- ఆందోళనలో రైతులు


ముగ్గళ్లలో నీట మునిగిన పంటలు


మిర్తిపాడులో ముంపునకు గురైన పంట పొలాలు

సీతానగరం: ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. లంకలు, పంట పొలాలు ముంచెత్తుతోంది. రైతులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి వరద తగ్గుముఖం పట్టి తిరిగి పోటెత్తింది. గోదావరి వరద నీటిమట్టం మరింత పెరగడంతో పంటలు ముంపు బారిన పడ్డాయి. సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ళ, సింగవరం, వంగలపూడిలలోని లంకభూములలో వేసిన పంటలు పూర్తి నీట మునిగాయి. సుమారు 200 ఎకరాల పంట నీట మునిగిందని, ఎకరాకు రూ.35వేల నుంచి రూ.50 వేల వరకూ పెట్టిన పెట్టుబడి వృథావుతోందని రైతులు లబోదిబోమంటున్నారు. గోదావరి వరదతో లంకభూములు కోతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. గతంలో వచ్చిన గోదావరి వరదతో రఘుదేవపురం, ముగ్గళ్ళ, ములకల్లంక తదితర గ్రామాలోని లంకభూములు కోతకు గురయ్యాయి. మరి ఇప్పుడు గోదావరి వరద ఏమి జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కొండ గోదావరి ముంపులో పంట భూములు

అఖండ గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొండ గోదావరి పోటెత్తి 1200 ఎకరాలకు పైగా వరి పంట ముంపు బారిన పడింది. బొబ్బిల్లంక వద్ద గల స్లూయిజ్ వద్ద గోదావరి వరద నీటి మట్టం ఎక్కువగా ఉన్నందున గేట్లు ఆటోమిటిక్‌గా మూసుకుపోయాయి. గ్రామాల్లో కురిసిన వర్షం నీరు, సూరంపాలెం ప్రాజెక్ట్ మిగులు జలాలు బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద నుంచి గోదావరిలోకి వెళ్లే మార్గం లేకపోవడంతో కొండ గోదావరి వెనక్కి పోటెత్తడంతో మిర్తిపాడు, ఉండేశ్వరపురం, రఘుదేవపురం, రాపాక, నల్గొండ, ముగ్గళ్ల, వంగలపూడి, రామచంద్రపురం, చినకొండేపూడి తదితర గ్రామాల వద్ద పంట పొలాలు నీట మునిగాయి. రాపాక, కోటికేశవరం రోడ్డుపైకి కొండ గాదావరి నీరు చేరుకుంది. గోదావరి వరద తగ్గుముఖం పట్టకపోతే ముంపు ఉంటుందని, మరింత నీరు చేరితే రాకపోకలు నిలిచిపోతాయని ఆయా గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ములకల్లంకవాసులకు ఎన్డీఆర్ఎఫ్ సేవలు

అఖండ గోదావరి వరద ఉధృతి పెరగడంతో ములకల్లంక ముంపునకు గురైంది. రాకపోకలు నిలిచిపోయాయి. ఆ గ్రామ ప్రజలకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలందించారు. అధికారులు ఏర్పాటు చేసిన రెండు బోట్లపై అక్కడకు వెళ్లే ప్రజలకు అండగా ఉండి వారిని సేఫ్‌గా తీసుకెళుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రజాక్ గ్రామం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించారు. తహసీల్దార్ ఎస్ సత్యనారాయణ రాజు, ఎంపీడీఓ కె.రమేష్ వరద బాధితులకు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

నియోజకవర్గాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతా


గాదరాడలో జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరంలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆరోగ్యవంతంగా ఉండాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శనివారం కోరుకొండ మండలం గాదరాడ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగా రాజానగరాన్ని తీర్చిదిద్దుతానన్నారు. ఇప్పటివరకూ చేసిన సేవా కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయన్నారు. అంబులెన్స్‌ల నిర్వహణ, వైద్యశిబిరాలు, రక్తదానం, కేన్సర్‌పై యుద్ధం తదితర సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. వీటిలో తన భార్య రాజశ్రీ కూడా ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జీఎస్ఎల్, సుబద్ర హాస్పటల్స్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో సుమారు వెయ్యి మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మెన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో-కన్వీనర్ గణేశుల పోసి, నాయకులు హరిబోలు చినబాబు, సర్పంచులు, ఎంపీటీసీ, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బెల్లం నిల్వలపై ఎస్ఈబీ దాడులు

ముగ్గురు వ్యక్తుల అరెస్టు


గోకవరం శివారున సారా బట్టీపై దాడి చేసిన ఎస్ఈబీ అధికారులు

గోకవరం: మండలంలోని సారా బెల్లం నిల్వలపై కోరుకొండ ఎస్ఈబీ అధికారులు శనివారం దాడులు చేశారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్ ఆదేశాల మేరకు కోరుకొండ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గోకవరం శివారున సారా బట్టీలపై దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడిలో కాండ్రేగుల రాము అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించారు. తనకు గోకవరానికి చెందిన ముప్పిడి నాగేశ్వరరావు, కొత్తపల్లికి చెందిన నాయుడు రాజేష్ సారా బెల్లం సరఫరా చేస్తున్నట్టు చెప్పగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి చెందిన సారా బెల్లం నిల్వలపై దాడులు చేసి 2,450 కేజీల సారా బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వీరి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు. ఈ దాడిలో ఎస్సై టి.నిరంజనరావు, హెచ్‌సీలు శివకుమార్, నాగేంద్రకుమార్, అప్పారావు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి వైద్యసేవలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న రాజా

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ వద్ద మోటారు సైకిల్‌పై వెళుతున్న వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. అటుగా వెళుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా 108కి కాల్ చేసి క్షతగాత్రుడిని కార్పొరేట్ హాస్పటల్‌కు తరలించారు. అక్కడి డాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి అతని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పలువురికి పరామర్శ

కోరుకొండ మండలం గాదరాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిర్ల శివ సుబ్రహ్మణ్యం తల్లి మంగాదేవి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజా పరామర్శించారు. అలాగే జంభూపట్నంలోని ఉల్లి చంద్రరావు తండ్రి ఇటీవల మరణించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తన సానుభూతిని తెలిపారు.

ఆలయ విశిష్టతను కాపాడేందుకు కృషి చేయండి

- ఎంపీ భరత్‌రామ్
- ఉమా కోటిలింగేశ్వర, సీతారామ స్వామివార్ల పాలకమండలి ప్రమాణ స్వీకారం


ఆలయంలో ట్రస్టుబోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం నగరంలో దాదాపు వెయ్యి సంవత్సరాల ఘన చరిత్ర ఉన్న ఉమా కోటిలింగేశ్వర స్వామి, సీతారామ స్వామి ఆలయ విశిష్టతను కాపాడి గత వైభవాన్ని తీసుకురావాలని ఆలయ ధర్మకర్తల మండలిని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. శనివారం ఈ ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ అరిగెల బాబూ నాగేంద్ర ప్రసాద్, డైరెక్టర్లతో ఎంపీ భరత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయానికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఒక వెబ్‌సైట్ రూపొందించి ఆలయ చరిత్ర, విశిష్టత పొందుపరచాలని సూచించారు. తొలుత ఎంపీ భరత్, డాక్టర్ గూడూరి, అడపాలను పండితులు వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు.

నూతన పాలకవర్గం

ఉమా కోటిలింగేశ్వర స్వామి, సీతారామ స్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అరిగెల బాబు నాగేంద్ర ప్రసాద్, సభ్యులుగా పీవీవీ రమణ, వై.నాగరాజు, వంగ ఉమ, ఎస్.విజయలక్ష్మి, కె.దేవి పోసయ్య, గుదే పార్వతి, కే లక్ష్మిశైలజ, గారవిజయకుమారి, కోఆప్షన్ సభ్యుడిగా కె.నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఇద్దరికి రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు కాగా, వాటికి సంబంధించిన చెక్కులను ఎంపీ భరత్ రామ్ లబ్ధిదారులకు అందజేశారు. దొడ్డి నూకరత్నంకు రూ.6 లక్షలు, గూడాల లక్ష్మికి రూ.1,54,745 సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి.

చర్చి ప్రారంభం

కడియం: పొట్టిలంకలో నిర్మించిన బైబిలు మిషన్ సెయింట్ దేవదాస్ పెనుమాయేలు ప్రార్థనా మందిరం శనివారం ఘనంగా ప్రారంభించారు. అంతర్జాతీయ బైబిలు మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జానదేవదాస్, జాయింట్ సెక్రటరీ రెవరెండ్ జె.ఆగమనరావుల ఆశీర్వాద ప్రార్థన అనంతరం ప్రారంభించారు. బైబిలు మిషన్ కొత్తపేట జోన్ పాలకవర్గ సభ్యులు రెవరెండ్ యం.ప్రవక్త యెషయా అధ్యక్షత వహించారు.ఎన్. విమలా యేసురత్నం మందిరం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో బైబిలు మిషను పాలకవర్గ సభ్యులు, దైవసేవకులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకోగా, వారి నుంచి రెండు కోళ్ళు, రూ.2300 నగదు, 9 ద్విచక్రవాహనాలు సాధ్వీనం చేసుకున్నారు. ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రక్షణాలయం యూత్ ట్రీట్

సీటీఆర్ఐ: సువిశేషపురంలో ఉన్న రక్షణాలయం సెయింట్ జోన్ పేరిష్ చర్చిలో శనివారం యూత్ ట్రీట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లాలోని సుమారు 30 చర్చిల నుంచి ఏఈఎల్‌సీ చర్చి యువ ప్రతినిధులు 400 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని యువతను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన వర్షిప్ లీడర్ బ్రదర్ జోయల్ ఎన్.బాబు అద్భుతమై వాక్య పరిచర్యతో ఆకట్టుకున్నారు. రాచపల్లి ప్రసాద్, పి.నైసీ పోతుమూడి, పి.విజయ్ ఆనంద్ రాజ్ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే ఉపేక్షించేది లేదు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- మోరంపూడి ఎఫ్ఓబీ పనుల పరిశీలన


మోరంపూడి ఎఫ్ఓబీ పనులపై ఆరా తీస్తున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్ వద్ద ఏ ప్రమాదం జరిగినా, ప్రాణ నష్టం జరిగినా సహించేది లేదని ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్‌ను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ హెచ్చరించారు. రాజమండ్రి నగరంలోని మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. గత రెండు వారాల్లో పరిశీలించిన పనులు, ఇచ్చిన టార్గెట్‌లో వర్షాల కారణంగా కాస్తంత జాప్యం జరిగినా మొత్తంపై పనులు త్వరితగతిన జరుగుతున్నాయని ఎంపీ భరత్ మీడియాకు తెలిపారు. ఎఫ్ఓబీ 8 పిల్లర్స్ పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ఆర్ఈ ప్యానల్స్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందని, ఇందు కోసం మోరంపూడి జంక్షన్ జాతీయ రహదారికి రెండు వైపులా ట్రాఫిక్ నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ, విజయవాడ వైపుగా వచ్చే వాహనాల ట్రాఫిక్‌ను మళ్లించాలని, వారం పది రోజుల్లో ట్రాఫిక్ పోలీసులు ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే ఆగస్టు నెలాఖరు నాటికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని కాంట్రాక్టు నిర్వాహకులను ఆదేశించారు. పనులు జరిగే చోట తప్పనిసరిగా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని, కనీసం 30 ఫ్లడ్ లైట్లు ఉండాలని, ప్రమాదాలు జరిగితే ఎవరి బాధ్యత అని కాంట్రాక్ట సిబ్బందిని ప్రశ్నించారు. అప్రమత్తంగా పనులు చేయాలని హెచ్చరించారు. ఆయన నేషనల్ హైవే పీడీ డీ సురేంద్ర, పార్టీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, చీరా రాజు, బొప్పన సుబ్బారావు, ఆరే చిన్ని, దుంగా మంగా లక్ష్మి, దుంగా సురేష్, సుందర్ సింగ్ తదితరులు ఉన్నారు.

ఆలయ మరమ్మతులు ప్రారంభం

సీటీఆర్ఐ: గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండయేశ్వర స్వామివారి దేవాలయ అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ పనులను దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ ఇన్నమూరి ప్రదీప్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆలయ గోపురం మరమ్మతులు, రంగులు వేయడం, ధ్వజస్తంభ పునర్నిర్మాణం తదితర పనులు చేయనున్నారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు యజ్ఞవరపు శ్రీనివాసరావు, కేదారశెట్టి వనిత, ఎరకల రజిని, వియ్యపు రాఘవేంద్రరావు, సలా సావిత్రి, దాసరి శివప్రసాద్, గుబ్బ వాణి, ముచుపల్లి అవినాష్, ఎక్స్ అఫీషియో సభ్యుడు పెద్దింటి నీలకంఠ శర్మ, అర్చకులు కొడమంచలి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌కు సత్కారం

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కానుబోయిన సాగర్‌కి అల్లా ఆశీస్సులుండాలని ముస్లిం నాయకులు ప్రార్థనలు చేశారు. శనివారం పవిత్ర మొహర్రం సందర్భంగా స్థానిక ఆజాద్ చౌక్ వద్ద ఉన్న లైన్ మసీదులో సమాజ్ చేసిన అనంతరం సాగర్‌ని సత్కరించారు. ఇటీవల జిల్లా పరిశ్రమల కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రభుత్వం ఆయనను నియమించిన సందర్భంగా ముస్లిం నాయకులు దువా చేసి వారి సంప్రదాయ పద్ధతిలో సన్మానించారు.